బాలాజీనగర్‌ డివిజన్‌ సమస్యలను పరిష్కరించాలి



బాలాజీనగర్‌ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్‌ పగుడాల శిరీష బాబూరావు, జీహెచ్‌ఎంసీ డీసీ రమేష్‌, అన్ని శాఖల అధికారులతో కలిసి బాలాజీనగర్‌ డివిజన్‌ ధనలక్ష్మీ సెంటర్‌లోని బాలాజీనగర్‌ పార్కు, డ్రైనేజీలను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయా సమస్యలపై జరిగిన సమీక్షా సమావేశంలో కాలనీ, బస్తీవాసులు చేసిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఫేజ్‌ 1, ఫేజ్‌ 2 పార్కుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని, ప్రగతినగర్‌ నాలా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. బాలాజీనగర్‌, వివేక్‌నగర్‌, ఆంజనేయనగర్‌, కైత్లాపూర్‌, కేపీహెచ్‌బీ కాలనీల్లో స్థానికంగా నివసిస్తున్న ప్రజలు భూగర్భ డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పలువురు పేర్కొన్నారు. వర్షాకాలం దృష్ట్యా నాలా పనులు, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, శానిటేషన్‌, ఫాగింగ్‌ పనులపై దృష్టి పెట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. స్థానికులు, పలు అసోసియేషన్ల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌, కార్యదర్శి వెంకటేష్‌ చౌదరి, జలమండలి అధికారులు, అసోసియేషన్‌ సభ్యులు, బీఆర్‌ఎస్‌ నేతలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని నిజాంపేట్‌ రోడ్డుకు చెందిన వెంకట నరేష్‌ ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. రూ.55 వేలకు సంబంధించిన మంజూరుపత్రాలను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ, ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని, అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి నిలుస్తుందని



సీఎం సహాయ నిధి పత్రాలను బాధిత కుటుంబసభ్యునికి అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

తెలిపారు. కార్యక్రమంలో మాదాపూర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, బ్రిక్‌ శ్రీనివాస్‌, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జగన్‌

జగద్గిరిగుట్ట: డివిజన్‌ అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని జగద్గిరిగుట్ట కార్పొరేటర్‌ జగన్‌ అన్నారు. శనివారం సోమయ్యనగర్‌, మగ్దూంనగర్‌లలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైహింద్‌, వేణు యాదవ్‌, యాదగిరి, సతీష్‌, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, మైసమ్మనగర్‌లో జూలై 26న బొడ్రాయి(నాభిశిల) పునప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని కార్పొరేటర్‌ జగన్‌కు శనివారం ఆహ్వానపత్రికను అందజేశారు. కాలనీ అధ్యక్షుడు బ్రహ్మానందచారి, ఆంజనేయులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పదిమందికి అన్నం పెట్టడమే లక్ష్యం

జగద్గిరిగుట్ట: పదిమందికి అన్నం పెట్టడమే ప్రధాన లక్ష్యంగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించామని శ్రీ హనుమాన్‌ అన్నప్రసాద సేవా ట్రస్ట్‌ చైర్మన్‌ కన్నెకంటి లక్ష్మణ్‌, అధ్యక్షుడు కళ్యాణ్‌రావు పాటిల్‌ తెలిపారు. చింతల్‌ శ్రీసాయి కాలనీలోని శ్రీ అభయాంజనేయ, పోచమ్మ అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం శనివారానికి 60 వారాలు పూర్తి అయ్యాయి. సొంత ఖర్చుతో మొదలుపెట్టిన ఈ అన్నదాన కార్యక్రమం నేడు అనేకమంది భక్తులు విరాళాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.



అన్నదాన కార్యక్రమంలో భక్తులు

భరత్‌నగర్‌ కాలనీ సమస్యలను పరిష్కరిస్తా



భరత్‌నగర్‌ కాలనీలో పాదయాత్ర చేసిన బండి రమేష్‌

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ శనివారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీ సమస్యల గురించి నియోజవర్గం బ్లాక్‌ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి వివరించారు. మార్కెట్‌ రోడ్డు, పార్కింగ్‌ సమస్యలను వివరించారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్‌ అధ్యక్షుడు టి.వేణు, సోషల్‌ మీడియా సంతోష్‌కుమార్‌, భరత్‌నగర్‌ అధ్యక్షుడు అశోక్‌ ముదిరాజ్‌, సీనియర్‌ నాయకులు టి.సంతోష్‌ కుమార్‌, శ్రీనివాస్‌రెడ్డి, పాండు ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కళాశాలకు జేఎన్‌టీయూ అండ

వీసీ బుర్రా వెంకటేశం

కేపీహెచ్‌బీ కాలనీ: 'జేఎన్‌టీయూ ప్రతి కళాశాలకు అండగా ఉంటుంది. మీ సమస్యలు, మీ ఇబ్బందులు తెలియజేయాలి'అని వైస్‌ చాన్సలర్‌, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. యూనివర్సిటీలో ప్రైవేట్‌ ఫార్మా కాలేజీ, ఇంజనీరింగ్‌ కాలేజీ యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌తో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రెక్టార్‌ డా. విజయకుమార్‌ రెడ్డి, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ డా. వెంటేశ్వర్‌రావు, అకడమిక్‌ ఆడిట్‌ డైరెక్టర్లు పాల్గొన్నారు. బుర్రా వెంకటేశం మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే విద్యార్థులకు మంచి విద్యను అందించవచ్చన్నారు. మెరుగైన విద్యాబోధన కోసం యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఓ విభాగం ఏర్పాటు చేసి అనుభవం గల వారిచే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.



జేఎన్‌టీయూలో జరిగిన సమావేశ దృశ్యం



ధర్మపురి శ్రీనివాస్‌ చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన బండి రమేష్‌, కాంగ్రెస్‌ నాయకులు

ధర్మపురి శ్రీనివాస్‌కు నివాళి

బాలానగర్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ పీసీసీ అధ్యక్షుడిగా, మాజీమంత్రిగా ధర్మపురి శ్రీనివాస్‌ కాంగ్రెస్‌ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. శనివారం శ్రీనివాస్‌ మృతికి సానుభూతి వ్యక్తం చేస్తూ బాలానగర్‌లోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, తూము వేణు, లక్ష్మణ్‌, నయీమ్‌, కె. రమేష్‌, ఎం. రమేష్‌, నరసింహ యాదవ్‌, మధుగౌడ్‌, జాకీర్‌, రాజ్‌పటేల్‌, థామస్‌, రజిత, బోజమ్మ, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

వర్షపునీరు నిలిచే.. కలుషిత నీరు కలిసే..



ఈడబ్ల్యూఎస్‌ ప్రాంతంలో చెత్తాచెదారంతో నాలా, మూసుకుపోయిన నాలా



ఈడబ్ల్యూఎస్‌లో ప్రమాదకరంగా విద్యుత్‌ వైర్లపై పడిన చెట్ల కొమ్మలు

మూసాపేట: మూసాపేట డివిజన్‌ ఈడబ్ల్యూఎస్‌ కాలనీ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవటం, కలుషిత తాగునీరు, అస్తవ్యస్తమైన డ్రైనేజీ, కరెంటు సమస్యలతో స్థానికులు నిత్యం పోరాటం చేయాల్సి వస్తోంది. భరత్‌నగర్‌ కాలనీ వాటర్‌ ట్యాంక్‌ సమీపంలో ఉన్న ఈడబ్ల్యూఎస్‌ వద్ద చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలిచిపోతున్నాయి. ఎగువ ప్రాంత నుంచి వచ్చిన వరద కాలువ ద్వారా డ్రైనేజీలో కలవాలి. కానీ, వరద కాలువ పూర్తిగా మూసుకుపోయింది. పూడిక తీయకపోవటంతో చెత్తాచెదారం, మట్టితో నిండిపోయింది. ట్యాంక్‌ వెనుక భాగంలో గల రోడ్డు మధ్యలో చిన్నపాటి కాలువ ఉండి ముందు భాగంలో ఉన్న నాలాలో కలిసేది. కానీ, రోడ్డు నిర్మాణ సమయంలో కాలువ మూసుకుపోయింది. దాంతో వర్షపునీరు ఎటూ వెళ్లలేక ఇళ్ల ముందు, రోడ్డుపై నిలిచిపోతున్నాయి. ఆ రోడ్డును తవ్వి నీరు సాఫీగా వెళ్లేవిధంగా పైపులైన్‌ వేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

గ్రౌండ్‌లను అభివృద్ధి చేయాలి

ఈడబ్ల్యూఎస్‌లో రాయలసీమ, శివసేన గ్రౌండ్‌లు ఉన్నాయి. రాయలసీమ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసిన మాదిరిగా శివసేన గ్రౌండ్‌ను కూడా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. చెత్తాచెదారంతో నిండిపోయి ఉంది. ఇక్కడ నిర్మించిన ఇంకుడు గుంతలు కూడా పూర్తిగా కనుమరుగైపోయాయి. గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి ఇంకుడు గుంతలు నిర్మించాలని స్థానిక యువత కోరుతున్నారు. ఈడబ్ల్యూఎస్‌లో విద్యుత్‌ వైర్లపై చెట్ల కొమ్మలు పడిపోయి కిందికి వేలాడుతున్నాయి. ఉరుములు, మెరుపులు వచ్చినా చిన్నపాటి వర్షం కురిసినా షార్ట్‌ సర్క్యూట్‌ అవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఇళ్ల ముందు, ఇంటి మధ్యలో విద్యుత్‌ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి.

కలుషిత జలాల సమస్య

కాలనీలో కలుషిత మంచినీటి సమస్య అధికంగా ఉంది. అసలే లో ప్రెషర్‌తో వస్తున్న నీరు మొదట పావుగంట సేపు దుర్గంధం వెదజల్లుతూ కలుషిత నీరు సరఫరా అవుతోంది. కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కోరినా వాటర్‌ వర్క్స్‌ అధికారులు తూతూ మంత్రంగా పనులు నిర్వహించి వదిలివేస్తున్నారు. శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు. తమ కాలనీలో భారీ వాటర్‌ ట్యాంక్‌ ఉన్నా నీటి సమస్య ఉండటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగి మోతీలాల్‌ ఆరోగ్యాన్ని కాపాడాలి



ఆసుపత్రిలో మోతీలాల్‌ను పరామర్శించిన కుమార్‌యాదవ్‌

ఆల్విన్‌కాలనీ: నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోతీలాల్‌ నాయక్‌ అనే నిరుద్యోగి గత వారం రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేసి ఆరోగ్యం క్షీణించి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం మోతీలాల్‌ను బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌ యాదవ్‌ పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం దీక్షలు చేస్తుంటే రాష్ట్ర మంత్రులు మాత్రం సినిమాలు చూస్తూ కాలయాపన చేయటం దుర్మార్గమన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ అవంతినగర్‌ తోట కమ్యూనిటీ హాలులో ఈ నెల 30వ తేదీ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్‌ నాగరాజు పార్థివ్‌ లాంగ్‌ కేర్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మధుమేహం, పోస్ట్‌ లంచ్‌ బ్లడ్‌ షుగర్‌ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను సైతం అందజేస్తారని తెలిపారు.


పదవీ విరమణ



జేఎన్‌టీయూలో పదవీ విరమణ పొందిన వారిని సత్కరించిన అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో శనివారం పలువురు ఉద్యోగులు పదవీవిరమణ చేశారు. యూనివర్సిటీలో సివిల్‌ డిపార్ట్‌మెంట్‌ సీనియర్‌ ప్రొఫెసర్‌, ఐక్యూఏసీ డైరెక్టర్‌ డాక్టర్‌ జీకె విశ్వనాథం, ఎస్‌వీఎస్‌ఎస్‌ మూర్తి, వి. అశోక్‌ సూపరిటెండెంట్‌, టి.సుకుమార్‌ పదవీ విరమణ పొందారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్‌ డా. కె.విజయకుమార్‌ రెడ్డి, రిజిస్ట్రార్‌ డాక్టర్‌ కె. వెంకటేశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపాల్‌, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



భాస్కర్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ 2 జీఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు భాస్కర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ఆయనతో కేక్‌ కట్‌ చేయించి, శాలువాతో సన్మానించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర విద్యామంత్రి రాజీనామా చేయాలని ర్యాలీ



నీట్‌ పేపర్‌ లీకేజికి నిరసన తెలిపిన సునీల్‌ కుమార్‌ యాదవ్‌ తదితరులు

కూకట్‌పల్లి: నీట్‌ పేపర్‌ లీకేజీపై శనివారం ఇక్కడ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్‌ పార్టీ నేత జిట్లా సునీల్‌ కుమార్‌యాదవ్‌ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి పీపుల్స్‌ హాస్పిటల్‌ నుంచి ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా మంత్రి రాజీనామా చేయాలని డిమాడ్‌ చేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ విచ్చేసి విద్యార్థులకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బాలాజీనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు కృష్ణ, కూకట్‌పల్లి డివిజన్‌ అధ్యక్షుడు రమేష్‌, మేడ్చల్‌ జిల్లా ఎన్‌ఎస్‌యుఐ ప్రధాన కార్యదర్శి రాహుల్‌సింగ్‌, కూకట్‌పల్లి యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు హరి, మూసాపేట డివిజన్‌ యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు సచిన్‌, జహంగీర్‌, సుశీల్‌ యాదవ్‌, శ్రావణ్‌, అనిల్‌, యశ్వంత్‌, లక్కీ తదితరులు పాల్గొన్నారు.

'కిడ్డీ మౌంట్‌ లిటేర'లో గ్రీన్‌ కలర్స్‌ డే



కిడ్డీ మౌంట్‌ లిటేర గ్రీన్‌ కలర్స్‌ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని కిడ్డీ మౌంట్‌ లిటేర పాఠశాలలో శనివారం గ్రీన్‌ కలర్స్‌ డే వేడుకలు నిర్వహించారు. కలర్స్‌ విశిష్టత విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆకుపచ్చ కలర్‌ మనిషి జీవితంలో ఎంతో ముఖ్యమని అన్నారు.

స్టార్టప్‌ కంపెనీలపై వర్క్‌షాపు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో డైరెక్టరేట్‌ ఆఫ్‌ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌, ఇన్నోవేషన్‌ అండ్‌ స్టార్టప్స్‌ ఆధ్వర్యంలో 'స్టార్టప్‌ కంపెనీ వ్యవస్థాపక ఔత్సాహికులకు విజయసూత్రాలు' అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథి జేఎన్‌టీయూ వైస్‌ చాన్సలర్‌ బుర్రా వెంకటేశం వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది విద్యావంతులున్న మన దేశంలో ఉద్యోగకల్పనకు స్టార్టప్‌ కంపెనీల ప్రాముఖ్యత ఎంతో ఉన్నదని, ఇటువంటి స్టార్టప్‌ కంపెనీ వ్యవస్థాపకులు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, వాటిని సాకారం చేసుకోవడానికి సరైన దిశగా నిరంతరం కృషి చేయాలన్నారు. రిసోర్స్‌ పర్సన్‌గా విచ్చేసిన ఇండియన్‌ స్కిల్స్‌ డెవలప్‌మెంట్‌ సర్వీసెస్‌ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్‌ డా. శ్రీనివాసరావు స్టార్టప్‌ కంపెనీల వ్యవస్థాపకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ కె. వెంకటేశ్వర్‌రావు, రెక్టార్‌ ప్రొఫెసర్‌ కె. విజయకుమార్‌ రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్‌ ఆర్‌ శ్రీదేవి పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న బుర్రా వెంకటేశం తదితరులు

శ్రీనిధి గ్లోబల్‌ స్కూల్లో 'గ్రీన్‌ డే'



సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులలో హరితహారంపై అవగాహన పెంచడంలో భాగంగా పద్మనగర్‌ శ్రీనిధి గ్లోబల్‌ స్కూల్లో వనమహోత్సవాన్ని నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం స్కూల్‌ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటగా, ప్రతీ విద్యార్థి నాటిన మొక్కను సంరక్షణ తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. గ్రీన్‌ డే సెలబ్రేషన్స్‌ లో స్కూల్‌ చైర్మన్‌ నల్లపాటి వెంకటేశ్వర రావు, ప్రెసిడెంట్‌ నల్లపాటి రాజేశ్వరి, ప్రిన్సిపాల్‌ కోమలాదేవి, స్కూల్‌ టీచర్స్‌ పాల్గొన్నారు.

అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐగా నాగరాజు

కుత్బుల్లాపూర్‌: అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐగా ఎ.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సీఐ నాగేశ్వరరావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో శంకరపల్లి, మోకిలా పోలీస్‌స్టేషన్‌ పరిధిలో డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న నాగరాజుకు అల్వాల్‌ ట్రాఫిక్‌ సీఐగా బాధ్యతలు అప్పగిస్తూ సైబరాబాద్‌ కమిషనర్‌ అవినాష్‌ మహంతి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం ఆయన బాధ్యతలు చేపట్టి సుచిత్ర నుంచి కొంపల్లి, గుండ్లపోచంపల్లి, దూలపల్లి ప్రాంతాల్లో పర్యటించారు. రోడ్లపై వాహనాలు అడ్డదిడ్డంగా నడపరాదని, లైసెన్స్‌, హెల్మెట్‌ లేకుండా వాహనదారులు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొటర్‌ శ్రీనివాసరావు తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావులు పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నివాళి



మల్లు రమేష్‌ చిత్రపటానికి నివాళులు అర్పించిన సంజీవరావు తదితరులు

కూకట్‌పల్లి: కాంగ్రెస్‌ సీనియర్‌ నేత మల్లు రమేష్‌ 5వ వర్ధంతి శనివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు రమేశ్‌ చిత్రపటం వద్ద పలువురు నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సంజీవరావు, రాజు, ప్రసన్న, కుమార్‌, నిఖిల్‌, దయానంద్‌, భువనేశ్వర్‌, మల్లు రమేష్‌ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో ధర్మపురి శ్రీనివాస్‌ది కీలకపాత్ర



కేపీహెచ్‌బీ బస్‌స్టాప్‌లో డి.శ్రీనివాస్‌కు నివాళులు అర్పించిన దృశ్యం

కేపీహెచ్‌బీకాలనీ: మాజీమంత్రి డి.శ్రీనివాస్‌ మృతి చెందటం పట్ల కేపీహెచ్‌బీ డివిజన్‌ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్‌కుమార్‌ సంతాపం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ బస్‌స్టాప్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ప్రత్యేక పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ, పొడుగు అప్పారావు, ఫణీంద్ర, రంగస్వామి, పీఆర్‌ నాయుడు, రామారావు, గోపాల్‌చౌదరి, సాయి, పొన్నం రజిత, రేష్మ, దివ్య, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్‌ ఉద్యోగ విరమణ



హైమవతిని జ్ఞాపికతో సత్కరించిన అధ్యాపక బృందం

సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల తెలుగు ఉపన్యాసకురాలు ఆర్‌.హైమవతి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ప్రిన్సిపాల్‌ తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్‌ విద్యాధికారి కిషన్‌ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా హైమావతి కృషి చేశారని, ఆమె భావి జీవితం సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు రమేష్‌, ఐలయ్య, కవిత, పరశురాములు, వాసవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

బెలూన్స్‌ డే

కుత్బుల్లాపూర్‌: చింతల్‌ వెంకటేశ్వరనగర్‌లోని బచ్‌పన్‌ ప్లేస్కూల్‌లో శనివారం బెలూన్స్‌ డే నిర్వహించారు. వివిధ రంగుల బెలూన్‌లతో చిన్నారులు సందడి చేశారు. గాల్లో బెలూన్‌లను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పాఠశాల ఆవరణ అంతా వివిధ వర్ణాల బెలూన్‌లతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.